# పతిదేవుళ్ళు-ఆడకూతుళ్ళు

"వెళ్ళొస్తాను నాన్నా!"

గురుమూర్తిగారికా మాట వినిపించకపోలేదు. కానీ తలపైకెత్తి సుజాతవైపు చూచే నిబ్బరం మాత్రం లేకపోయింది. దోషిలా తలవంచుకుని ఆయన అలాగే నేలవైపు చూస్తున్నాడు.

"మాట్లాడరేమండీ! అమ్మాయి వెళ్ళొస్తానని చెబుతుంటే ఉలుకూ, పలుకూ లేకుండా వుండిపోతారా? చెప్పండి వెళ్ళి రమ్మని" శాంతమ్మ హెచ్చరించింది.

"అలాగేనమ్మా! క్షేమంగా వెళ్ళిరా!' కరిగి నీరైన గుండె గొంతుక కద్దుపడడంతో మాటలు తడబడ్డాయి. భర్తకైతే ధైర్యం నూరిపోయడానికి ప్రయత్నించింది గానీ తన వంతు వచ్చేసరికి శాంతమ్మ ముఖంగూడా వెలవెల పోసాగింది. పెల్లుబికి వస్తున్న దుఃఖం కళ్ళల్లోంచి తొంగిచూచింది.

"అధైర్యపడవద్దులేవే అమ్మా! నాకొచ్చిన భయమేమీలేదు. వెళ్ళగానే జాబు వ్రాస్తానులే! చెప్పుమరి, వెళ్ళి రానా?"

ప్రయాణీకుల రణగొణ ధ్వనుల అలజడిని చీల్చుకుంటూ గార్డు వేస్తున్న ఈల వినిపించింది.

శాంతమ్మ ముఖం అవతలికి త్రిప్పుకుని, చీరచెరగుతో కళ్ళు తుడుచుకునే సరికి బండి కదిలింది.

తమ జీవన సౌభాగ్యాన్నంతా బిడ్డల కోసమే మీదుగట్టి, ఆ బిడ్డలు రొక్కలొచ్చిన పక్షులై ఎగిరిపోగా ఒకరికొకరు మాత్రం తోడుగా మిగిలిన ఆ వృద్ధదంపతుల్ని చూపానినంతవరకూ కిటికీలోనుంచీ చూస్తూ వుండిపోయింది సుజాత.

"ఏ వూరెళ్తున్నావమ్మాయ్?"

సుజాత ఉలికిపడింది. తనను గురించి బాగా తెలిసినవాళ్ళ మధ్య వుండలేక తాను పారిపోతూ వుంది. కానీ ఏ కొండ గుహలోకి వెళ్ళి కూర్చుంటేనో తప్ప ఈ లోకం మనిషిని వదిలిపెట్టేటట్టు లేదు. ఇది తన కిష్టంలేని విషయాలను గురించి తన చేత మాట్లాడించాలని చూస్తుంది. జవాబు చెప్పడానికి సుతరామూ యిష్టపడని ప్రశ్నలతో వేధిస్తుంది.

"అయ్యో, అదేమిటమ్మా! కొత్త పెళ్ళి కూతురివిలా వున్నావు. ఆయనగారెంత మగమహారాజయితే మాత్రం, వచ్చి పెళ్ళాన్ని కాపురానికి తీసుకెళ్ళే పాటి ఓపరికం లేకపోయిందా? ఒకవేళ అతగాడు రాలేదనుకో, దేవీదేవరల్లా తల్లితండ్రులు లేకపోతే గదా! తల్లినో, తండ్రినో వెంటబెట్టుకుని వెళ్ళలేకపోయావా?"

ఇలాంటి సందేహాలకు తనేమని సమాధానం చెప్పగలుగుతుంది?

సుజాత కొకటే ఉపాయం స్ఫురించింది. అది వేటగాడి బారినుంచి తప్పించు కోడానికి ఉష్ట్రపక్షి అవలంబించే ఉపాయం.

మంకుపట్టు పట్టినట్టుగా కళ్ళు గట్టిగా మూసుకోవడంతో సుజాతకు బాహ్య ప్రపంచంతో సంబంధం తెగిపోయినట్టయింది. కానీ తనిలా ప్రయాణం చేయవలసి వచ్చినందుకు హేతుభూతమైన పరిస్థితులొక్కొక్కటిగా జ్ఞప్తికి రావడంతో ఆమె మనసు కల్లోలసాగరమై పోసాగింది.

నెలరోజుల క్రితం ఒకనాటి రాత్రి ఎనిమిది గంటలప్పుడు -

"ఏమండీ! కనిపించలేదా?"

గురుమూర్తిగారు అయోమయంగా చూచారు భార్యవైపు. కనిపించలేదన్న భావాన్ని సూచిస్తున్నట్టుగా ఆయన తల మాత్రం కాస్త కదలినట్టు తోచింది. ఆయన నడుస్తుంటే అది నడకలా లేదు, నిద్రలో నడిచినట్టుంది.

"మాటాడరేమండీ? ఇంతకూ ఎంత దూరం వెళ్ళొచ్చారు?"

పెరికి పారేసిన తోటకూర కాడలా వాడిపోయి వచ్చిన గురుమూర్తి గారు వాలుకుర్చీలో కూలబడ్డారు. "బిగ్గరగా మాటాడొద్దు. ఎవరైనా వింటే బాగుండదు..."

వంటగది గుమ్మంలో నిల్చుని తండ్రివైపు చూస్తున్న సుజాత నిలువునా నీరైపోయింది. ఈసారి బాగా గొంతుక తగ్గించేసింది. శాంతమ్మ. "అయినా ఇదేం విద్దూరమండీ బాబూ! నాలుగు గంటలప్పుడు నిక్షేపంగా యింట్లో వున్న మనిషి. ప్రొద్దుపోయి చీకటి పడేసరికి అజా పజా లేకుండా ఏమైపోతాడండీ?"

"అజాపజా లేకపోవడమేమిటి, సూట్‌కేసు చేతబట్టుకుని బస్సెక్కాడని ప్రత్యక్షంగా చూచినవాళ్ళు చెబుతుంటే? పూలంగడి సీతారామయ్య లేడూ, అతడు చెప్పాడు. "ఏమిటండీ అల్లుడుగారూ! అప్పుడే తిరుగు ప్రయాణమా?" అని అడిగాడట కూడా!"

"అనుకున్నట్టే అయింది. ఎప్పుడైతే గదిలో సూట్‌కేసు కనిపించలేదో, అప్పుడే అనుకున్నాను..." నిల్చునే ఓపిక లేక గోడకు చేరగిలబడి కూర్చుండిపోతూ అంది శాంతమ్మ.

"గొప్ప నిరవాకమే చేశావులే! అన్నింటికీ మగవాడొకడే అడ్డుపడాలంటే ఎక్కడ వీలవుతుంది? ఆడమనిషికి కూడా తెలివితేటలుండాలి? ఎవరు లోపలికొస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో చూచుకోనక్కర్లా! గర్భగుడిలో మూలవిరాట్టులా వుంటే సరిపోయిందా?"

"అనండి బాబూ, ఎన్నయినా అనండి? అల్లుడుగారుండడం వీధివైపు గదిలో నాయె! గబుక్కున బయటికి వచ్చి, మెట్లుదిగి వెళ్ళడానికి ఎంతసేపు కావాలంటారు? అయినా ఇంటల్లుడు గదండీ! అతడేమైనా ఖైదీనా కళ్ళల్లో వత్తులు వేసుకుని కాపలా కాయడానికి?" శాంతమ్మ కళ్ళు కన్నీటి కొలకులైపోతున్నాయి.

"పైగా ఇదొకటా! అప్పుడే శోకాలు మొదలెట్టేశావా! వద్దొద్దు. ఆడబిడ్డను కన్న నేరానికి అలాంటి అవకాశాలెన్నయినా రావచ్చు. నీకు పుణ్యముంటుంది గానీ, ప్రస్తుతానికి కిముక్కుమనకుండా ఊరుకో!"

గదమాయించి భార్య నోరు మూయించేశారు గానీ గురుమూర్తిగారి బుర్రలో సైతం అంతకంతకూ తుఫాను హెూరు అతిశయిస్తూనే వుంది. ఎందుకిలా జరిగిందో తెలియడం లేదుగానీ, అల్లుడు హఠాత్తుగా అంతర్ధానమైపోవడం మాత్రం నిజం! అసలే కొత్తల్లుడు. బంధుత్వమూ కొత్తదే! పెళ్ళి జరిగి పట్టుమని పదిహేను రోజులైనా కాలేదు.

నెమ్మదిగా మాట్లాడే తీరునుబట్టి సంస్కారం ఉట్టిపడే నడతనుబట్టి 'అబ్బో' ఎంత కుదురైన అల్లుడు దొరికాడమ్మా శాంతమ్మగారికి' అంటూ ఇరుగుపొరుగు అమ్మలక్కలు అభినందనలు గుప్పించడంగూడా యిప్పుడిప్పుడే ప్రారంభమవుతూ వుంది. ఇంతలోనే ఈ పిడుగు! అదీ వానలేకుండా!

"అమ్మా, సుజాతా!" అన్నారు గురుమూర్తిగారు.

నిర్జీవప్రతిమలా స్తంభించిపోయి వున్న సుజాత ఉలికిపడింది. ఎవరో వెనకవైపు నుంచి త్రోసుకొచ్చినట్టుగా వచ్చి తండ్రికి దగ్గరగా నిల్చుంది.

"ఏమిటమ్మా యిది? మీరేమైనా గొడవపడ్డారా తల్లీ!"

"అబ్బే, అలాంటిదేం లేదు నాన్నా. మధ్యాహ్నం భోజనమయ్యాక పడుకోబోతూ సాయంకాలం మొదటి సినిమాకు వెళ్దామని గూడా అన్నారు."

మరైతే అప్పటికి మంచి మూడ్‌లో వున్నట్టే లెక్క!

"సినిమాకు వెళ్దామన్నాడు. ఆ తర్వాత?"

"పడుకుని నిద్రపోయారు..."

శాంతమ్మ కలుగజేసుకుంది.

"నాలుగ్గంటలప్పుడు నిద్రలేచి పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కుని తిరిగొస్తుండగా చూడడమే చూడడం..."

"పడుకుని నిద్రలేచాడనుకుందాం. ఆ తరువాతేం జరిగింది!" గురుమూర్తిగారి ప్రశ్న.

"గదిలోకి మంచినీళ్ళు పట్టుకెళ్ళాను. "సినిమా ప్రోగ్రాం అంటున్నారు గదా! తిరిగొచ్చేటప్పటికి భోజనానికి ఆలస్యమైపోతుంది. ఏదైనా ఫలహారం చేస్తాను టిఫిన్‌చేసి వెళ్దామ'న్నాను. సరే నన్నారు..."

రెండు నిమిషాలదాకా నేర పరిశోధనకు బ్రేక్ పడిపోయింది. ఆ తరువాత కాస్త వెనక్కు వెళ్ళి మళ్ళీ ఒక ప్రశ్న లేవదీశారు గురుమూర్తిగారు.

"టిఫిన్ చేయడానికని చెప్పి నువ్వీవలికొచ్చేశావు. అప్పుడతడు గదిలో ఏంచేస్తున్నాడు?"

"నిద్రొస్తే నిద్రపోవడం, మాట్లాడే వాళ్ళుంటే మాట్లాడ్డం. లేదంటే ఏదైనా పుస్తకం చూచుకోవడం. అంతకంటే ఏం చేస్తారు నాన్నా?"

"ఆ పుస్తకాలలాగే మంచంపైన పడివున్నాయి. మళ్ళీ వాటిని తీసి అలమరాలో పెట్టే వ్యవధానమైనా లేకపోయింది. ఏం పుట్టి మునిగిపోయిందో ఏమిటో, రెక్కలు మొలిపించుకుని తుర్రున జారుకున్నాడు..." ఇకపైన ఏడవకుండా వుండడం సాధ్యం కాదనిపించిందేమో లేచి దూరంగా వెళ్ళిపోయింది శాంతమ్మ.

ఆరోజు రాత్రి ఆ యింట్లో పిల్లికి మాత్రమే పసందైన విందు. మానవ ప్రాణులు మూడూ కటిక పస్తు.

స్టేషనొచ్చింది కాబోలు, రైలాగింది. ఎదురు సీటావిడ తనను పలకరించే అవకాశం దొరకనీకుండా జాగ్రత్తపడుతూ సుజాత కిటికీలోనుంచి వెలుపలికి చూచింది.

ఎవరో పల్లెటూరి పెళ్ళివాళ్ళు పట్టు బట్టలతో, ట్రంకుపెట్టెలతో రైలు దిగి ప్లాటుఫారమంతా తమదే అయినట్టు నడిచివెళ్తున్నారు. అందరిలోనూ పెళ్ళి కూతురికోసం వెదికాయి సుజాత చూపులు. జండాకొయ్యలా పొడుగ్గా వున్న వరుడి వెంట వధువు చిన్న ఉత్సవ విగ్రహంలా గునగునా నడిచివెళ్తోంది. సుజాతకు కసాయివాణ్ణి వెన్నంటి నడిచే మేకపిల్ల గుర్తొచ్చింది. అలాంటి ఊహ కలిగినందుకు మనసు చివుక్కుమనకపోలేదు. కానీ ఒక చోట పుట్టి పెరిగి, ఒక రకమైన అభిరుచుల్ని సంస్కారాల్ని ఒంటబట్టించుకున్న అమ్మాయిని వివాహమన్న పేరుతో ఒక అపరిచితుడి వెంట పంపడడం వల్ల భావికాలంలో ఎలాంటి పరిణామాలు పొడసూపినా పొడసూపవచ్చు.

ఎవరిదాకానో ఎందుకు? తన విషయాన్నే దృష్టాంతంగా తీసుకుంటే చాలదూ? సుజాత మనసు మళ్ళీ గతంలోకి చొచ్చుకపోయింది.

అల్లుడుగారు మాయమైపోయిన తర్వాత రెండు రోజులు గడిచాయి.

ఆ రెండు రోజుల్లోనూ జరిగిన ముఖ్య విశేషం గురుమూర్తిగారు అల్లుడుగారు ఉద్యోగం చేస్తున్న ఊరికి వెళ్ళి తిరిగి రావడం!

ఈ రెండు రోజుల పొడుగునా ఊరి గాలిలో వ్రేలాడ గట్టిన రబ్బరు బెలూనులా వుండిపోయింది గృహవాతావరణం. గురుమూర్తిగారు తిరిగి రావడంతో బెలూను కాస్తా టపీమంటూ విచ్చిపోయింది.

"ఏమండీ! ఏమయింది? కనిపించాడా? ఏమన్నాడు?" గుక్క తిప్పుకోకుండా ప్రశ్నించింది శాంతమ్మ.

గురుమూర్తిగారు లాభం లేదన్నట్టుగా పెదవి విరిచారు. తనకేమీ అర్థంకావడం లేదన్నట్టుగా చేతులు త్రిప్పారు. ఇక మీదట తాము చేయగలిగిందేమీ లేదన్నట్టు నీరసంగా కుర్చీలో కూలిపోయారు.

"ఏమిటండీ, ఏమంటాడతను!" శాంతమ్మ ఆక్రోశించకుండా వుండలేకపోయింది.

"వెళ్ళాను. పదకొండు గంటలై వుంటుంది. ఆఫీసు టైము గదూ, అందుకని నేరుగా అక్కడికే దారితీశాను. ఆఫీసులోనే వున్నట్టు తెలిసింది. లీవు క్యాన్సిల్ చేసుకున్నాడట. జవానుతో చెప్పి పంపాను. చాలా తొందర పనిలో వుండటంవల్ల యిప్పుడప్పుడే బయటికి రావడం సాధ్యపడదంటూ జవాబు వచ్చింది. సాయంకాలం మూడు గంటలదాకా అక్కడే కాపెట్టుకుని వుండిపోయాను..."

"ఎందుకూ, సూటిగా లోపలికి వెళ్ళి పదిమంది ఎదుటా ఎడా పెడా నాలుగు మాటలు వడ్డించలేకపోయారా?"

"పిచ్చి మొగమా! నీ వుక్రోషానికి సర్వత్రా చెల్లుబాటు లేదు. అది నీ పట్ల గౌరవమున్న వాళ్ళ దగ్గర మాత్రమే చెల్లుతుంది. అల్లుడంటే ఏమిటి? పై ఆఫీసరులాంటివాడు. మనం ఒక మాట ఎక్కువగా మాటాడినా, ఒక తప్పటడుగు వేసినా ముప్పే! మళ్ళీ తప్పుకోలేము."

"మరైతే అతడు మాత్రం యింతపనీ చేస్తే అడిగేవాళ్ళే లేరా..."

"ఇంతకూ నువ్వు పూర్తిగా వినవే లేదు."

"చెప్పండి."

"ఇలా కాదని జవాను చేతిలో ఒక రూపాయి పెట్టి ఈయనగారు అద్దెకుంటున్న యిల్లెక్కడో తెలుసుకున్నాను. ఆ చిరునామా కాగితం చేతబట్టుకుని బయటికి వచ్చాను. ఇల్లంతా తిరిగి తిరిగి ఎలుక బోనులోకి వచ్చినట్టుగా అతడెంత సేపటికైనా అక్కడికొచ్చి తీరుతాడని నా ఊహ. నందనవనం వీధంటే ఏ రిక్షా వాడైనా తీసుకెళ్తాడు. ఆ వీధిలో అయిదో యిల్లే. అతడి కాపురం మిద్దెపైన. ఓ చిన్న కాపురానికి కావలసిన వసతులన్నీ అక్కడే వున్నట్టే వున్నాయి..."

"ఇప్పుడా ఇంటి గొడవెందుకండీ, అతడు తిరిగొచ్చిన తర్వాత ఏమన్నాడో చెప్పరే..."

"తిరిగి వచ్చివుంటే గదా! నేనింటి దగ్గర కాపు వేసి వుంటానని పసిగట్టాడేమో, తన రాకకు బదులుగా ఇల్లుగలావిడకొక చీటి పంపించాడు. స్వగ్రామంనుంచి అర్జంటుగా రమ్మని వాళ్ళ నాన్నగారు జాబు వ్రాసినట్టు, అందుకని నిల్చున్న పాటున వెళ్ళిపోతున్నట్టు ఆమెకు తెలియబరిచాడు..."

"అబ్బో, అబ్బో, ఎంత పనిచేశాడో చూశారా?" తల్లడిల్లిపోతూ అంది శాంతమ్మ.

"కార్మిక ప్రతినిధికి ఫ్యాక్టరీ కామందు దగ్గర ఇంటర్వ్యూ దొరుకుతుంది. ప్రతిపక్ష నాయకుడికి ప్రధాన మంత్రి దగ్గర ఇంటర్వ్యూ దొరుకుతుంది. పిల్లనిచ్చిన మామగారికి ఆ పాటి భాగ్యం లేకపోయింది. ఏం చేద్దాం. అంతా మన కర్మ..."

అంతే. అప్పటి నుంచీ ఇల్లు యిల్లులా లేదు. రగులుతున్న కుంపటిలా తయారైంది.

సాయంకాలం నాలుగుగంటలవేళ నందనవనం వీధి దాదాపు నిర్జనంగా వుంది. రిక్షానుంచి క్రిందికి దిగిన సుజాతకు ఇంటి ముంగిట మల్లె పందిరి క్రింద ఓ అయిదేళ్ళ అమ్మాయి కనిపించింది.

"అమ్మాయ్! రమణమూర్తి గారుండడం ఇక్కడ ఈ మిద్దెపైన్నే గదూ!"

"అవునండీ! ఇప్పుడు లేరుగా! ఆఫీసు కెళ్ళారు."

ఇంటి బయటినుంచే మేడపైకి మెట్లున్నాయి. ఒక్కొక్కటిగా మెట్లెక్కుతూ అనుకుంది సుజాత. వచ్చేసరికి ఓ పసిపిల్ల ఎదురుకావడం తనకెంతో మేలైపోయింది. లేకుంటే సవాలక్ష ప్రశ్నలకు బదులు చెప్పుకోలేక తన ప్రాణం బిక్కచచ్చిపోయి వుండేది.

మిద్దెపైన ఆరుబయలే ఎక్కువ. ఓ వైపు మాత్రం సన్నటి వసారాతో బాటుగా ఓ పెంకుటిల్లు. అర్థాంతరంగా బయల్దేరి వస్తూ రమణమూర్తి అలమారాలో పెట్టి మరచిపోయి వచ్చిన తాళం చెవిని సూట్‌కేసులోనుంచి పైకి తీసింది సుజాత. బుద్ధిగా తాళం విచ్చుకుంది. రెక్క తలుపులుగూడా సవ్వడిలేకుండా లోపలికి తెరుచుకున్నాయి.

ముందుగా కుడికాలే పెట్టింది.

వరుసగా మూడు గదులు. అటువైపున పడక గది, ఇటువైపున వంటగది అనుకుంటే మధ్యలో వున్న కాస్త పెద్ద గదిని హాలనుకోవచ్చు. ఎక్కడి వస్తువులక్కడ చెల్లాచెదురుగా పడివున్నాయి. సిగరెట్టు ముక్కలు, సగం సగం కాలిన అగ్గిపుల్లలు, తుక్కు కాగితాలు, మాసిన బట్టలు, దుమ్ము, ధూళీ...

ఆ వైపు గదిలో వేసిన పడక వేసినట్టే వుంది.

ఈవైపు గదిలో ఏవో పాకకార్యాలయితే జరిగినట్టున్నాయి గానీ, ఆ గిన్నెలూ, గ్లాసులూ సరిగ్గా కడిగిన పాపాన పోయినట్టులేదు.

ఇదే తన ఇల్లు రమణమూర్తి అనుమతిస్తే.

ఇక్కడే తన కాపురం పతిదేవుడు అనుగ్రహిస్తే.

పవిత్ర భారతదేశంలో ఆడదాని అసహాయ పరిస్థితి కొట్టవచ్చినట్టుగా స్ఫురించినట్లై సుజాత ఖిన్నురాలైపోయింది. కళ్ళ నిండుకూ కన్నీళ్ళు నిలిచాయి. ఇక్కడ తన కన్నీటిని తుడిచి ఓదార్చడానికెవరున్నారు? కంటికి రెప్పలా కాచుకోగలిగిన వాళ్ళు, ప్రాణానికి ప్రాణంగా చూచుకోగలిగిన వాళ్ళు ఎక్కడో వందలమైళ్ళ దూరంలో వున్నారు. తనువు ఎక్కడవున్నా వాళ్ళ మనసులు మాత్రం యిక్కడ తనచుట్టే తిరుగుతూ వుంటాయి.

సూట్‌కేసు క్రిందపెట్టి పైటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది సుజాత.

జీవితమంటే ఏమిటి? పరిస్థితుల్ని ఎదుర్కోవడం. అందుకు సిద్ధమయ్యే తనిక్కడికి వచ్చింది. యుద్ధభూమిలో అడుగుపెట్టిన తర్వాత దిగాలుపడిపోవడంవల్ల రెండందాలా నష్టమే! అప్పుడిక వేరు ఆలోచన లేకుండా ముందుకు వెళ్ళడమే గత్యంతరం. తప్పదు.

చీరచెరగును నడుముకు చెక్కింది సుజాత. దారికడ్డంగా పడివున్న చీపురుకట్టను పైకి తీసి చెత్తాచెదారమంతా ఊడ్చేసింది. పైకప్పునుంచి చాందినీలకు మల్లే వ్రేలాడుతున్న బూజునంతా తుడిచింది. ఎక్కడ వస్తువులక్కడ పెట్టి యిల్లంతా సర్దుకునేటప్పటికి ఆమె ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. వంటగదికి నడుమ ఓ పిట్టగోడ పెట్టి సగం మేరకు స్నానాలకని ప్రత్యేకించారు. అక్కడున్న తొట్టినిండుగా వుండడమేగాదు. కొళాయిలోగూడా నీళ్ళొస్తున్నాయి. శుభ్రంగా పాత్రలన్నీ కడిగి పెట్టేసరికి గంట ఆరు కావచ్చింది. బాయిలర్‌లో నిప్పువేసి పెట్టడంవల్ల ఆ పాటికి నీళ్ళుగూడా కాగాయి. సుజాత స్నానం చేసి దుస్తులు మార్చుకుంది. ఇక తలదువ్వుకోవడమే తరువాయి. దగ్గరలో నుంచి పాదరక్షల శబ్దం వినిపించింది.

ఒక్క నిమిషం పాటు గుండె కొట్టుకోడం గూడా ఆగిపోయినట్టే సుజాత స్తబ్ధురాలై నిలబడిపోయింది.

ద్వారానికెదురుగా వచ్చి నిల్చున్న ఆకారానికి మొదట వెలుగుతున్న విద్యుద్దీపం కనిపించింది. తరువాత ఆ దీపం క్రింద దువ్వెన చేతబట్టుకుని నిల్చున్న సుజాత కనిపించింది.

"నువ్వా! ఎందుకొచ్చావ్? ఎవరు రమ్... మన్నారు?"

దారి యిస్తున్నట్టుగా తప్పుకుని సుజాత గోడచాటుగా వెళ్ళిపోయింది.

లోపలికి వెళ్ళడమా, బయటికి వెళ్ళిపోవడమా అన్న రమణమూర్తి తటపటాయింపు కొద్ది క్షణాల వరకూ కొనసాగింది. ఇది తన ఇల్లు, ఉంటే తానే ఉంటాడు. ఇంకొకరికి జడిసి తానెందుకు పారిపోవాలి అనుకున్నట్టుగా అతడు ఒక్క విసురున లోపలికి వచ్చేశాడు. గదిలోకి వెళ్ళి మంచం వాల్చుకుని పడుకొన్నాడు.

పది పదిహేను నిమిషాల వరకు యింట్లో మౌనం రాజ్యమేలింది.

సమస్యనలాగే పొడిగిస్తున్న ఆ దుస్సహమైన నిశ్శబ్దానికి మొట్టమొదట భంగం కలిగించినవి సుజాత మాటలే!

"నీళ్ళు కాగాయి. స్నానం చేద్దురు గాని లేచిరండి"

తాను వేసుకున్నది అక్షరాలా అలక పాన్పే అయినట్టుగా, గిరుక్కున అటువైపు తిరిగి పడుకున్నాడు రమణమూర్తి.

సుజాతకు కాస్త అవకాశం చిక్కినట్టయింది. "మీరెందుకో కోపంగా వున్నారని తెలుసు. ఆ కోపాన్ని మరింత ఎక్కువ చేయాలని గాదు నేనిక్కడికి రావడం. కారణమేమిటో తెలుసుకుందామని..."

"మీ కోపం నన్నొక్కదాన్ని మాత్రం బాధించేటట్టయితే దాన్ని భరించడానికి నేను వెనుదీసి వుండను. ఉత్తపుణ్యానికి మా అమ్మా, నాన్నా కుమిలి పోతూంటే చూస్తూ కూచోలేకపోయాను. వాళ్ళు నన్ను కన్నారు. పెంచి పెద్ద జేశారు. జీవితంలో ఎన్నెన్ని కష్టనష్టాలయితే వున్నాయో అన్నింటినీ వాళ్ళు చవి చూద్దమైంది. వృద్ధాప్యంలో వాళ్ళ కొక్కటే ఆశ. కూతురు నెమ్మదిగా కాపురం చేసుకుంటూ వుంటే చూడాలని. మీరు కావలిస్తే నన్ను తిట్టండి, కొట్టండి, హింసించండి కానీ నా కొక్కటే కోరిక. నేనిక్కడ సంతోషంగా వున్నట్టు మా అమ్మా, నాన్నా అనుకోగలిగితే చాలు. నాకింకేమీ వొద్దు..."

"చాల్లే వూరుకో! మీ అమ్మా నాన్నల మాట నాతో చెప్పొద్దు..."

సుజాత తనను తాను నిగ్రహించుకోగల స్థితి దాటిపోతూ వుంది "మీరలా అంటే నేనేమనగలను? భగవంతుణ్ణి ఎవరు చూచారు? నేను భగవంతుణ్ణి తల్లిదండ్రుల్లోనే చూచాను."

"చెప్పొచ్చావులే ధర్మపన్నాలు! వాళ్ళు నమ్మించి ఎదుటి మనిషినెంతగా దగా చేయగలరో తెలిసిపోయింది! నీ బుకాయింపులేం నా దగ్గర చెల్లవు..."

తాను నమ్మిన బలవత్తరమైన సత్యం దారుణమైన అవహేళనకు గురైపోతున్న ఆ తరుణంలో సుజాతకు తన నిస్సహాయ స్థితిని జ్ఞప్తిలో పెట్టుకునే ఓపిక లేకపోయింది. నిండా మునిగిన తర్వాత చలి వుండదంటారు. చెప్పవలసి వున్న నాలుగు మాటలూ చెప్పేసిన తర్వాత తన జీవితమేమైపోయినా పరవాలేదు. భ్రమాప్రమాదాలతో నిండిన కృతక ప్రపంచంలో అజ్ఞానంతోను, అబద్ధాలతోను ఎవరు మాత్రం సహజీవనం చేయగలరు?

"వాళ్ళేం దగా చేశారండీ?" ఎట్ట ఎదుటికి వెళ్ళి నిల్చుని, రమణమూర్తి కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించింది సుజాత.

"మీరు పుస్తకాల్లో 'త్యాగం' 'త్యాగం' అంటూ చదువుకునే మాటకు రూపకల్పనచేసి చూచుకుంటే వాళ్ళ స్వరూపమేమిటో అవగతమౌతుంది. వారికి నేను అయిదో బిడ్డను. మిగిలిన నలుగురూ మగవాళ్ళు. తమ రక్తమాంసాల్ని వెచ్చించి, జీవశక్తిని ధారపోసి వాళ్ళు అన్నయ్యల్ని చదివించారు. మా నాన్నగారేం పెద్ద ఉద్యోగి కాదు. చిన్న బడిపంతులు. కొడుకులందర్నీ కాలేజీదాకా చదివించారంటే అందుకోసం ఆయన ఎన్నెన్ని యాతనలకు గురైవుంటాడో ఊహించుకోవచ్చు. చదివిస్తే ఏమైంది? కడగొట్టు బిడ్డను నేను

ఆడదాన్నయిపోయాను. నాకు పెళ్ళి చేయవలసి వచ్చే సరికి బట్టలకని, నగలకని, కట్నానికని పెద్ద మొత్తమే కావలసి వచ్చింది. నాన్నగారు ఉత్తరాలు రాసి చూచారు. స్వయంగా ఒక్కొక్క కొడుకు దగ్గరికి వెళ్ళొచ్చారు. ఇదిగో, ఈ వెయ్యి రూపాయలు తీసుకు వెళ్ళమని ఏ అన్నగారు చెప్పలేదు. ఆఖరుకు పిత్రార్జితంగా వచ్చిన ఆ ఒక్క యింటినీ అమ్ముకోవలసి వచ్చింది. కొనుక్కున్న పుణ్యాత్ముడెవరోగాని, ఈ పెళ్ళి జరిగేదాకా అందులో ఉండనిచ్చాడు. రేపో మాపో దాన్ని ఖాళీచేసి తీరాలి. పెన్షను డబ్బులు తిండికైనా సరిపోవు. ఎక్కడ తలదాచుకుంటారండీ వాళ్ళు? ఏమౌతారు?"

మతిపోయినవాడిలా రమణమూర్తి దిగ్గున లేచి కూర్చున్నాడు. "బిడ్డలకోసం తల్లితండ్రులు తమ సుఖాల్ని వదులుకోవడం ఎక్కడా వున్నదే! ఇప్పుడదిగాదు విస్తరించి చెప్పుకోవలసిన విషయం" అంటూ సరాలున బల్లసొరుగును ఈవలికి లాగి అందులోంచి డైరీ చేతికి తీసుకున్నాడు. డైరీ పుటల్లోనుంచీ ఓ పెండ్లి పత్రిక క్రిందికి జారింది.

"చూడు. ఇదేమిటో చూడు. రెండో పెళ్ళి దాన్ని తీసుకొచ్చి నాకు కట్టబెడతాడా మీ నాన్నగారు?" అంటూ గద్దించాడు.

సుజాత ఆ పెండ్లి పత్రిక చేతికి తీసుకుంది. ఒకసారి ఆద్యంతమూ చదివి చూచుకుంది. తలపైకెత్తి రమణమూర్తి వైపు చూచింది. ఆరడగుల రమణమూర్తి ఆ క్షణంలో ఆమెకొక అర్భకుడుగా మాత్రమే కనిపించాడు.

సుజాత పెదవులపైన సన్నగా ఓ హాసరేఖ విరిసింది.

"నిజమేనండీ! ఇది పెళ్ళి పత్రికే! ఇందులో నా పేరున్న మాట గూడా నిజమే! కానీ ఇదిలా తయారు కావడానికి వెనక మీరు నమ్మగలిగితే ఓ కారణం వుంది. సాధారణంగా బడిపంతుళ్ళకు అప్పులు పుట్టే అవకాశాలు అరుదు. వాళ్ళకు ప్రావిడెంటు ఫండని ఒకటి వుంటుంది. సజావైన కారణం చూపిస్తే అందులోనుంచి కొంత అప్పు లభిస్తుంది. మా నాన్నగారికి డబ్బుతో అవసరం లేనిదెప్పుడు? అనారోగ్యంగా వున్న భార్యకు చికిత్సకోసం అంటూ ఆయన ఒక అమోఘమైన కారణాన్ని కనిపెట్టి అవసరమైనప్పుడల్లా ఆ సాకుతో అప్పు పుట్టించుకుంటూ వచ్చారు. ఇలా జరగ్గా జరగ్గా ఒకసారి మా అమ్మకు నిజంగానే జబ్బు చేసింది. ఇక బ్రతకదేమోననుకున్నాం. ఎలాగో ఆ గండం గడిచింది. అప్పటినుంచీ ప్రావిడెంటు ఫండు అప్పుకోసమని తమ మామూలు పాత కారణాన్ని వాడుకునే నిబ్బరం నాన్నగారికి లేకపోయింది. మా చిన్నన్నయ్య ఉద్యోగ నిమిత్తం ఇంటర్వ్యూ కోసం ఢిల్లీ వెళ్ళవలసి వస్తే అందుకని డబ్బు కావలసి వచ్చి 'కూతురి పెళ్ళికోస' మంటూ అప్లికేషను పెట్టుకున్నారు. అనారోగ్యమంటే డాక్టరు సర్టిఫికెట్టు జతపరచాలి గదా! అలాగే కుమార్తె వివాహమంటే పెళ్ళి పత్రిక జతపరచాలి. నాన్నగారు ప్రెస్సుకు వెళ్ళి ఒక్కటంటే ఒకటి మాత్రం అచ్చువేసి యివ్వమన్నారట! వాళ్ళు పనిలోపనిగా పదిపన్నెండు పత్రికలు అచ్చువేసి యిచ్చారు. వాటిల్లో ఒకటి మీ చేతికి దొరికింది..."

ఒక నిముషం దాకా చలనం లేకుండా శిలా ప్రతిమలా కూర్చుండిపోయిన సుజాత స్వగతంలా కొనసాగించింది.

"ఆ చిన్నన్నయ్య యిప్పుడు నాగపూరులో వున్నాడు. పాపం, సెలవు దొరకలేదట. నా పెళ్ళికి రాలేకపోయాడు. ఐతేనేం, గ్రీటింగ్స్ పంపించాడు లెండి, మూడు రూపాయలు ఖర్చుపెట్టి!"

మరునాటి ఉదయం ఆఫీసుకు బయల్దేరుతూ అడిగాడు రమణమూర్తి -

"మీ వూరికి నువ్వు జాబు రాస్తావా? లేకపోతే నన్ను రాయమంటావా, సుజాతా!" అని.

"నేను రాస్తే నమ్మొద్దుటండీ? ఊహూ, మీరే వ్రాయాలి. 'మీ అమ్మాయి యిక్కడికి సురక్షితంగా వచ్చి చేరింది. కులాసాగా వుంది. మీరు మరేమీ బెంగపడొద్దు' అని రాయండి. బాబ్బాబూ, మీకు పుణ్యముంటుంది. ఆ వ్రాసేది కాస్త ఎక్స్‌ప్రెస్ డెలివరీలో" అంది సుజాత.

♦ *'యువ' దీపావళి సంచిక - 1975* ♦